# "దేశం నాకిచ్చిన సందేశం"

**శ్రీ శివరాజు వేంకట సుబ్బారావు (బుచ్చిబాబు)**

"ఏమైంది?"

"పోయింది."

"నేననుకుంటూనేవున్నా. నాటకాలు, సంగీతాలు, ఆటలు పెట్టుకుంటే చదువులొస్తయ్యా?"

"ఇప్పుడు నేను ప్యాసవకపోతే దేశానికొచ్చిన అనర్థం ఏముందంటారు?" అని అడిగాను యువక ఆవేశంతో.

"దేశానికేం—దేశం హాయిగా వుంటుంది. నీ మంచికోసమే. ప్యాసవుతే నాలుగురాళ్ళు గడించుకుంటావు. మీ నాయనగార్ని సుఖపెడతావు. పెళ్ళానికి నగలెడతావు. అంతే."

"నాలుగు రాళ్ళతోనే?"

ఆయన నా ప్రశ్న వినిపించుకోలేదు. వెళ్ళిపోయాడు. ఉత్తముడు. స్వార్థరహితుడు; ప్రపంచ శ్రేయోభిలాషి; సందేశం యిచ్చాడు; అవతారం చాలించుకున్నాడు.

ఇంటికొచ్చాను.

చేతులో పత్రికా, నా వైఖరీచూసి, మామగారు చతికిలపడ్డాడు. నేను తిన్నగా గదిలో కెళ్ళాను. సుందరం గోళ్ళు కొరుక్కుంటూ మంచం పట్టిమీద కూర్చుంది. నన్ను భోజనానికి ఎవ్వరూ లేవమనలేదో, లేక అంటే నేను వినిపించుకోలేదో, నా అంతట నేనే వెళ్ళి తినొచ్చాను.

సాయంత్రం క్లబ్బు కెళ్లాను.

"ఒరేయ్ బ్రదర్, నన్ను విడిచిపెట్టి నువ్వొక్కడవు ప్యాసవడం ఏం ధర్మంరా?" అన్నాడు మాధవరావు.

"ప్యాసైనవాళ్ళు మనల్ని విడిచిపెట్టలేదు-?"

"వాళ్ళలో త్యాగం లేదురా. ఇంతకీ వాళ్ళందరికీ ఉద్యోగాలు సిద్ధంగా వున్నయ్యా?"

"ఉండాలన్న నిబంధన వుందా?"

"లేకపోతే ఎందుకూ ప్యాసవాలన్న వుబలాటం—నీలా, నాలా, హాయిగా ఫేలవకూడదూ?" అంటూ మాధవరావు మెల్లిగా పేకాట బల్ల కేసి కదిలాడు. అమ్మయ్య, అనుకుని స్తంభానికి జార్లపడి నా చదువునిగురించి ఆలోచించడం మొదలెట్టాను. నేను వొంటిగాణ్ణి అనే భయంపోయింది. నాతో నిమిత్తం వున్నవారూ, నా శ్రేయస్సు కోరేవారూ, ఎందరో వున్నారు. నేనొక ముఖ్యమైన వ్యక్తిని. నా చేష్టలు కోర్టు పనిమీదవెళ్లే పెద్ద మనుషుల్ని నిలిపివేస్తాయి; మామగార్ని చతికిలపడేటట్లు చేస్తాయి. మాధవరావుల్ని సంతోషపెడతాయి; సుందరం కళ్ళల్లో కన్నీటిని రేపుతాయి. దేశం అంటే మాటలా! ఎవరో దేశం అంటే మట్టి కాదోయ్, దేశం అంటే మనుషులోయ్ అని పాడుకున్నారు. దేశం అంటే, సందేశం.

"పోయిందిటగా...."

ఉలిక్కిపడ్డాను. రాజారావుగారు; తాశిల్దారు. నాన్నగారి ప్రాణస్నేహితుడు.

"అవునండి."

"నీ పరీక్ష ఫేలవడం ఏమిటయ్యా!"

"..........."

"ఐ. సి. యస్. ప్యాసై, మా జిల్లాకి కలెక్టర్ గా రావల్సినవాడవు...."

"..........."

"ఈసారేనా బాగా చదువు. ఫస్టుగా పాస వాలి." అంతటిభారం నా నెత్తినపెట్టి చక్కా-పోయ్యాడు రాజారావుగారు. నేనొక సామాన్యుణ్ణి అనుకోడానికి తావులేదు. నేను అసాధారుణ్ణి: వొక మహత్తరవ్యక్తిని: లోకాద్ధారకుణ్ణి. దేశం తన పని కాసేపు మానేసి, నాకు సందేశం యిచ్చిందంటే, నేనెంతటివాణ్ణి అవాలో! దేశం సామాన్యమైనదా? 36 కోట్ల జనాభా—ఉత్తరాన హిమగిరులు, తూర్పున బంగాళాఖాతం; హరప్పా నాగరికత; ఎల్లోరాల శిల్పకళ; వాల్మీకి సంస్కృతి; కాళిదాసు ప్రతిభ. అనాదినుంచీ, కాంతి కాగడా ఆరిపోకుండా, పట్టుకుని నిలబడ్డ భారతమాత.

ఆవిడకి—నాతో నిమిత్తంవుంది. నాలుగు రాళ్ళనుండి, ఐ. సి. యస్. వరకూ నా యిష్టమొచ్చినదాన్ని సంపాదించుకోమంది. ఇంకేం కావాలి!

పరీక్షలు ఫేలయినకొద్దీ నేనొక మహావ్యక్తి నన్న నమ్మకం ధృడపడుతూ వచ్చింది. కావలసిన పరీక్షలు ఎల్లాగో పాసయ్యాను. ఆ మహానుభావుడు ఏరోజు నన్నాడో, నాలుగు రాళ్ళు గడించడంకూడా జరిగింది. మొదట్లో మన సంఘానికి నా నాలుగురాళ్ళ విషయం కొన్ని సందేహాలు రాకపోలేదు. నన్ను మొదట్లో పరామర్శించిన ఉత్తమ పురుషుడే, నిలేసి అడిగాడు.

"అవుతే, అబ్బాయి, నీకేమిస్తారు?"

"ఏవో నాలుగురాళ్ళు" అన్నాను.

"అది సరే లేవోయి—అసలెంతిస్తారు?"

"చెప్పానుగా."

"చెబుదూ—పెద్ద చదువులు చదివావు, వుద్యోగం చేస్తున్నావు. ఎన్ని వెటకారంమాట లేనా అంటావు." ఆయన సందేహం తీర్చనందుకు ఆయనకు వూ చిరాకు పుట్టుకొస్తోంది. సంఘం ఆయనచేత ఆ ప్రశ్నవేయించింది. ఆ ప్రశ్న వెనక, మన జాతీయత, నాగరికత, సంస్కారం దాగివున్నాయి. జాగు చెయ్యకూడదు. వెంటనే సమాధానం యిచ్చితీరాలి.

"నాలుగు రాళ్ళండీ" అన్నాను. ఆయన మీద నాకు బహిర్గతంకాని పగవుందో లేక నా ఆర్జన అల్పమైనదని చెప్పుకోడం, చిన్నతనమో,—నేను ఆ జవాబే యివ్వడానికి కారణం అవాలి.

"అంటే నాలుగు రూపాయిలా? హవ్వ!" అని నోరు నొక్కుకున్నాడు.

"మీ దీవన ప్రభావం" అన్నాను కొంచం కసిగా.

"ఆ—యిప్పుడు తెలిసిందిలే,—రోజుకి కాబోలు."

"కాదండి."

"వారానికి నాలుగా? గంటకి నాలుగా?"

"మీకంత వేళాకోళంగా వుంది."

"చంపక చెబుదూ."

చూడండి: ఆ సందేహం ఎట్లాంటిదో, ప్రాణంకూడా తీసేస్తుంది. ఆయన ఆ క్షణాన చచ్చిపోతే, నేను హత్యచేసిన వాణ్ణవుతాను. చెప్పితీరాలి.

"నాలుగు అంకెగల రెండంకెల సంఖ్య" అన్నాను. ఆయన తేరుకున్నాడు. నాడి ఆడుతోంది. గుండెలు యథాప్రకారం కొట్టుకుంటున్నాయి.

"తొంభైనాలుగా?"అని అడిగాడు పూర్తిగా శ్వాస విడుస్తూ.

"నలభైతొమ్మిది కాగూడదూ?" అన్నాను.

"ఇంత చదువూ చదివి యింతే? కిల్లికొట్టు వాడు గడించుకుంటాడు, ఓవేళ ముందు ముందు పెద్ద దవుతుందేమో లే" అంటూ ఆయన్ని తీసుకుని సంఘం లేచిపోయింది.

కిల్లీకొట్లని చూస్తూ యింటి కొచ్చాను. నా లాంటి సంపాదనగల యితర వ్యక్తులను గురించి ఆలోచించడం మొదలెట్టాను. రిక్షా వాడొకడు కనిపించాడు. మజ్జిగమనిషి—మోటారు నడిపేవాడు. ఏమో. వాళ్ళింకా ఎక్కువ ఆర్జిస్తారేమోనన్న సందేహం బయలుదేరింది. ప్రతివాడింటికీ వెళ్ళి కనుక్కుని వొక ఛార్టు తయారుచేస్తే? అట్లా చెయ్యడం వొక వుద్యోగం అవుతే ఎంత బాగుంటుంది!

భోజనాలదగ్గర మామగారికీ ఆ సందేహమే వొచ్చింది.

"ఎంతిస్తారేవిటి?"

నాకు మామగారిమీద కోపమొచ్చింది. వారమ్మాయికి ఉత్తరంలో ఆ విషయం వ్రాయనే వ్రాశాను. ఓవేళ యిందాక పరామర్శించిన వుత్తమ వ్యాఖ్యాత ముందే యిక్కడికొచ్చి, యీనకి 'కీ' యిచ్చిపొయ్యాడా!

"మీకు తెలుసుగా" అన్నాను.

ఆయన చిత్రంగా నవ్వడం మొదలెట్టాడు.

"అంటే వొచ్చే సంవత్సరానికి."

వారి అనుమానం ఇంక్రిమెంటు ఎంతని. అది కాస్తా చెప్పిద్దామనే ఆయన సంకల్పం!

"ప్రొబేషన్ పూర్తవుతుంది" అన్నాను. ఆయన గడసరి. మళ్ళా ఆ విషయం ప్రస్తావించలేదు.

సాయంత్రం క్లబ్బు కెళ్ళాను.

"ఏరా బ్రదర్, ఎంత డ్రా చేస్తున్నావురా?" అని అడిగాడు నాతో సమంగా ఫేలవుతూ వొచ్చిన నిజమైన సహాధ్యాయుడు. త్యాగి. కి న్నె ర సంఘానికి వొక సమాధానంతో గురిలేదు కాబోలు. ఆరాతీసి, సాక్షులచేత వొప్పించి, నిజానిజాలు ఋజువు చేస్తేకాని వూరుకోదు కాబోలు. ఈ స్వార్థరహితుడిచేత తన సందేహం యింగ్లీషులో చెప్పించింది. అది 'డ్రా' చెయ్యడం అంటే ఆవుని పాలుపిండినట్టు సంఘాన్ని పీడించి, బలాత్కారంగా లాక్కోవడం.

"నువ్వెంత 'డ్రా' చేస్తున్నావో నేను—అంతే" అన్నాను.

"ఓరి పూలా, మనం యింకా డ్రాయింగూ గ్రీయింగూ లేదు. తెలీదు?" అని నవ్వడం మొదలెట్టాడు యీ మహావీరుడు.

ఏం చెప్పను?

"అవుతే, నువ్వు 'డ్రా' చెయ్యడం మొదలెట్టినప్పుడు ఎంత 'డ్రా' చేస్తావో, అంత" అన్నాను. దెబ్బతో అదిరి పడ్డాడు. ధీరోదాత్తుడు గాయపడి, పేకాట బల్లకేసి కుంటుకుంటూ వెళ్లాడు.

అడుగడుక్కీ యీ ప్రశ్న నన్ను ఎదుర్కుంటూనేవుంది. కనపడిన వ్యక్తిని ముందుగా నేనే అడిగిస్తే ఎల్లా వుంటుందో? ఎవరో వీపుమీద చరిచారు. వెనక్కితిరిగాను. రాజారావుగారు; తాశిల్దారు. ఆయనకెంతిస్తారో?

"ఉద్యోగం దొరికిందటగా. ఏమిస్తారు?"

నన్నుగురించి తెలుసుకోవల్సిన విషయాలు ఎన్నో వున్నాయి. నా మనస్తత్వం, ఆంతరంగికం, ఆదర్శాలు, శృంగారజీవితం, రాజకీయాలపై అభిప్రాయాలు, యిన్నుండగా, నా జీతం వొక్కటేనా అడగవల్సింది?

"ఏదో—అందర్లాగే."

"అంటే?"

"మొదట్లో సాధారణంగా అందరికీ ఏమిస్తారో, నాకూ అదే."

చూపుడువేలు చూపించి తల పంకించాడు. నాకు వెంటనే అర్థం కాలేదు.

"పందా?" అన్నాడు.

"యించుమించు" అన్నాను.

"అయ్యో కర్మ! పందా లేదు?"

"రిటైరయ్యేటప్పటికీ రెండొందలుదాకా పెరుగుతుంది లెండి. మీకో?"

రాజారావుగారు సవ్వడం సాగించాడు. ఆయనకి నా మీదున్న అభిప్రాయం కొంత తగ్గినట్లు కనిపించింది. మా నాయనగారి ఆరోగ్యమేనా అడక్కుండా కదిలిపోయ్యాడు. నవ్వు నుంచి చాలా సేపటివరకూ ఆయన తేరుకోలేదు. నాకాశ్చర్యం కలిగింది. జీవితం హాస్యాస్పదంకావడం అంటే యిదే కాబోలు. నా కొచ్చేజీతం అంతటి ఆనందాన్ని కలిగించింది.

* * *

మూడేళ్ళు గడిచాయి.

నా జీతం ఎంతో ఎవరేనా అడిగినప్పుడల్లా, డైరీలో వొక గుర్తుపెట్టుకుంటున్నాను. అప్పటికి, రెండువందల యిరవై మూడుమార్లు యీ ప్రశ్న అడగడం జరిగింది. అది యించుమించు నే కలుసుకున్న వ్యక్తుల సంఖ్య. ఒక వ్యక్తి ఆ ప్రశ్నవేసి, సమాధానం తెలుసుకుంటే, ఆ సమాధానం, తన కుటుంబంలో



అందరికీ తెలుస్తుందని భావిద్దాం. అప్పుడు, వొక్కొక్క వ్యక్తి కుటుంబంలో, పదిమందేనా వుంటారని అనుకుంటే, రెండువేలమందికి పైగా నా జీతంగురించి తెలిసిందనుకోవొచ్చు. అంటే యించుమించు నా జీవితంలో ఎంత మంది పరిచితులవుతారో, అంతమందికీ తెలిసి పోయింది. అమ్మయ్య—అని నిట్టూర్చాను. చింతలేకుండా ఆనాడు కాఫీతాగి, సినిమా కెళ్ళాను. ఇంకెవ్వరూ, ఎప్పుడూ ఆ ప్రశ్న వెయ్యరు. ఒక పెద్దసమస్య పరిష్కారం ఐపోయింది.

సుందరం బంధువులింట్లో వివాహానికి నేనూ వెళ్ళాను. రెండోనాడు పెండ్లివారింటో, రెండో సారి కాఫీలువొచ్చే సూచనలు లేకపోతే, నేను హోటలుకేసి వెళ్ళాను. ఎదురుగుండా రంగనాథం కూర్చున్నాడు. చిరపరిచితుడే.

"అవుతే నువ్వు యిప్పు డెక్కడుంటు న్నావు ?"

ఫలానా చోటని చెప్పాను.

"అవునవును—జ్ఞాపకం వొచ్చింది. నీ కిప్పు డెంతిస్తున్నారు?" అని మొహం వింతగా చిట్లించాడు.

రంగనాథానికి యిదివర కొకసారి చెప్పడం జరిగింది. ఈవిధంగా అడిగినవాళ్ళే మళ్ళా అడగటం లంకించుకుంటే, దీనికి అంతుందా ?

"అదికూడా జ్ఞాపకం చేసుకో అన్నాను" నేను.



"వెనకోసారి చెప్పావు.నాకు మంద మతిరా."

"నామాటకేంగాని, నీ విషయం చెబుదూ. జీతం విషయం కాదు. మీ ఆవిడ ఆరోగ్యంఎట్లా వుంటోంది ? ఆమధ్య చాలా జబ్బు చేసిందటగా?" అన్నాను ధోరణి తప్పిద్దామనీ,నిజంగా తెలుసుకుందామనీ.

"ఇప్పుడు నింపాదిగానే వుంది. న్యూమోనియా. రెండునెల్ల జీతం వొదిలింది డాక్టర్లకి. ఐదా రొండ లైంది." అని మౌనంలో పడ్డాడు, కష్టాలు స్మరించుకుంటూ. ఇంక ఆ మనిషిని కదపడం మంచిదికాదని తోచింది. ఎందుకంటే అతని జీతం ఎంతో నేను అడక్కుండానే నాకు చెప్పాలని వుబలాటపడి చెప్పేశాడు. తనజీతం తెలియబర్చినవ్యక్తి అవతల వాడి దెంతో కనుక్కోకుండా వదల

డని స్వానుభవం. మెల్లిగా లేచి బిల్లు చెల్లించి రాబోతున్నాను.

"ఉండు, నేను వొచ్చేస్తున్నా"
అని లేచి వొచ్చాడు.

రోడ్డుమీదికి రాగానే యీ ధీరోదాత్తుడు అడిగేశాడు.

"అవుతే నీ కెంతిస్తున్నా రంటావు?"

"న్యూమోనియా చాలా ఖరీదైన వ్యాధన్న మాట!" అన్నాను,

న్యూమోనియాని వర్ణించాడు రంగనాథం, పందిట్లోకి చేరుకున్నాం, పన్నీరు జల్లేటందుకు రంగనాథాన్ని పిలిచారు. వెళ్ళాడు. నన్ను శాంతి ఆవరించింది.

ఎంతోసేపు లేదు.

బంధువులు, మిత్రులు, పరిచితులు, వోవది మంది పోగయ్యారు. ఆడపెళ్లివారి పీనాసి తనాన్ని చర్చిస్తున్నారు. చర్చలో పాల్గొన్న వారిలో ముఖ్యుడు, వొకాయన పొడుగ్గా వుంటాడు. గిరజాలు, వెడల్పాటి జరీకండువా, కోటుజేబు గడియారం అవీ వున్న ఆ పెద్ద మనిషి, నాపక్కన కూర్చున్న కళ్ళజోడు వ్యక్తిని సంబోధిస్తూ—

"మీరెవరి తాలూకు?" అని అడిగాడు.

కళ్లజోడువ్యక్తి ఆడపెళ్లివారి తాలూకేనని తేలిపోయింది.

"ఏం చేస్తున్నారు?"

ఫలానా అని చెప్పాడు.

"మీ కేమిస్తారు?"

సభ సమాధానం కోసం, వర్షంకోసం తపిస్తూ మేఘాలకేసి చూస్తున్న కర్షకుడిమాదిరి నిశ్శబ్దంగా వేచివుంది.

కళ్లజోడు వ్యక్తి తటపటాయించాడు.

"మేఘాలు దట్టంగా అల్లుకుంటున్నాయి.

"ఎనభై" అన్నాడు—వడగళ్లవాన పడింది.

గిరజాల ప్రతిభాశాలి కుటిలంగా నవ్వుతూ ఇల్లా అన్నాడు:

"మా వాళ్ళ తాలూ కొకడు మీ దాంటోనే వున్నాడు. నలభై అని చెప్పాడే!" అన్నాడు.

సభలో కలకం, ఆశ్చర్యం.

కళ్ళజోడు వ్యక్తి, అసత్యవాది — మోస గాడు, దొంగ—దొరికిపోయ్యాడు. సత్యాన్ని కాళ్ళు చేతులూ కట్టేసి, గిరజాల అతీతుడు అరిచేతులో పెట్టి నొక్కుతున్నాడు.

"నలభైని రెం డెట్టి గుణిస్తున్నారే!" అని రెట్టించాడు. కళ్ళజోడు వ్యక్తి తన జీతాన్ని రెట్టించినట్లు.

కళ్ళజోడు వ్యక్తి కడు చతురుడు.

"అంటే, అసలు జీతం—బేసిక్ పే— నలభయే ననుకోండి. వార్ ఎలొవెన్సు, సిటీ ఎలవెన్సు, తిండి ఎలవెన్సు, ఆఎలవెన్సు, ఈ ఎలొవెన్సు అన్నీ కలుపుగుని, ఏభై, ఏభై ఐదు, అరవై, డెభ్భై, డెభ్భై ఐదు దాకా దేకు తాయి." అన్నాడు కాని, ఎన్ని కలిపినా, ఎన భైకి దేకందే! సభ అతన్ని చూసి జాలిపడ్డా రు. కళ్ళజోడు వ్యక్తిని నిజంగా ఈ పరీక్షకు ఆగినందుకు రెండు నెల్లపాటు హాస్పిటల్లో వుంచా లనిపించింది.

గిరజాల భూతద్దం దృష్టి నా మీద ఎక్కడ పడుతుందో నని భయపడుతూనే వున్నాను. సత్యాన్వేషకుణ్ణి ఎవరు అరికట్టగలరు! నా మీద కూడా పడ్డాడు.

"మిమ్మల్ని ఎక్కడో చూసినట్లున్నాను" అన్నాడు.

"అవునవును. మీకు నా విషయం అంతా తెలుసు. జ్ఞాపకం చేసుకోండి" అన్నాను.

"కాకినాడా?"

"ఇంకా సందేహమా" అనేశాను తెగించి.

"ఇప్పు డేం చేస్తున్నారు ?"

"అప్పు డోటీ. ఇప్పు డోటీ వుంటుందా : ఎప్పుడూ వొకటే" అన్నాను.

సభికులలో కిలకిలలు.

"స్మరణకు రావడం లేదు" అన్నాడు గిర జాల భక్తుడు.

"తమ రేం చేస్తున్నారు ?" అన్నాను. చూడండి—నలుగుర్లో కెళ్ళి మాట్లాడడం అంటే నా కెంతో హడలు—అట్లాంటిది, సంఘం నాకెంత ధైర్యం ఇచ్చిందో!

"నేను రి టై ర య్యా ను లెం డి" అన్నా డాయన.

బాణంతో నే కూలాను.

కాసేపు సమాధిలో పడి తేరుకుని గిరజాల ప్రవక్త ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు.

"మీ కేమిస్తున్నారు ?"

నేను సమాధానం చెప్పకూడదని నిశ్చ యించుకున్నాను.

"మీ పెన్షన్ ఏమాత్రం ?" అన్నాను.

ఉద్రేకంతో తెల్ల గిరజాలు వూగిసలాడాయి.

"మా దంతా ఐపోయింది. మీది వోల్డు స్కేలా. న్యూ స్కేలా ?"

"మాది తులాభారం. భక్తితో తులసిదళం వేస్తే తూగిపోతాం" అన్నాను.

ఇద్దరు ముగ్గురు సంతోషించారు. ఒకరు మెచ్చుకున్నారు కూడా.

"ఏదో పెద్దవాణ్ణి అడిగాను. చంపక చెప్ప వయ్యా" అన్నాడు గిరజాల వ్యక్తి.

"చెప్పకపోతే, మరణమే నంటారు ?" అన్నాను.

"ఓర్ నీ ఇది బంగారంగాను—చెబుదూ."

గిరజాల వ్యక్తి నన్ను బుజ్జగించాడు. బెది రించాడు. కోపించాడు. ఆజ్ఞాపించాడు—కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమలాడాడు; ఏ మిస్తారో చెప్ప మని దీనంగా ప్రపంచాన్ని సంబోధించాడు.

"అనుభవజ్ఞులు—మీరే చెప్పుకోండి" అన్నాను. ఆయన జీవితంలో నేర్చుకున్న పాఠాలని వల్లె వేసుకుంటున్నాడు.—వందా ? నూట యాభయ్యా ? రెండు వందలా ? ఏది ? అబ్బ. బాధ ! తట్టుకోలేను—చెప్పాలి. భూమి పాదాల కింద విడిపోతోంది. ఆకాశం తలమీద కూలి పోతోంది—చెప్పు. చెప్పు—నీ కెంతిస్తారు ? ఏమిస్తారు ? దేశం చెప్పిన సందేశం అది.

సభికులు విస్తుపోయారు.

కళ్ళజోడు వ్యక్తి ఆడదైతే నన్ను రాక్ష సంగా వివాహం ఆడును—అంతటి సంతోషం ప్రకటించాడు. నేను సమాధానం ఇవ్వనందుకు నే నొక కథానాయకుణ్ణి అయ్యాను. సంఘం ఈ ప్రశ్న ఎందు కడుగుతుందో నా కర్థం కా లేదు. బ్రిటిషువారు పాలించిన రోజుల్లో ప్రభు త్వం నడపడానికి. వారికి చాలామంది గుమా స్తాలు కావల్సివొచ్చింది. మధ్య తరగతి కుటుం బాలు ఈ వుద్యోగాలకి ఎగబడ్డాయి. వీరికి స్వ యంగా కృషి చెయ్యడం గౌరవానికి లోటు. భూములను ఎవరికో వ్యవసాయాని కిచ్చి, జమీందారులా కూర్చునేటంతటి భూములూ లేవు. అంచేత వీరికి గుమస్తా గిరి శరణ్యం. మొదట్లో గుమస్తాలుగా చేరినా, బోలెడు ఆస్తులు సంపాదించగలిగేవారు—లంచగొండి తనంవల్ల. మా ముత్తాతకి తన పేరు సంతకం చెయ్యడం కూడా రాదు. రెండిళ్ళు, నలభై ఎకరం భూమీ, సంపాదించాడు—ఎనిమిది రూపాయల జీతంలో. అంతేకాదు ; తాలూకా గుమస్తాగా చేరినా, ఆ రోజుల్లో నాలు గింగ్లీషు ముక్కలొస్తే గబగబ పెద్దపెద్ద వుద్యోగాల లోకి వెళ్ళేవారు. ఆ వుద్యోగాలకి పెద్ద జీతాలూ,

హోదాకూడా వుండేవి. హోదా వున్నవార్ని. ఎదురుగావెళ్ళి జీతం ఎంతో అడిగే ధీమా ప్రజాసామాన్యానికి లేదు. అంచేత వారికి ఆ హోదాలో ఎంత జీతమో తెలుసుకోవాలని వుబలాట పడేవారు. ఆ సాంప్రదాయంలో పెరిగిన గిరజాల వ్యక్తులలాంటి వారు మన సంఘంలో ఎందరో వున్నారు. వారంతా అందువల్ల ఈ ప్రశ్న అడుగుతున్నా రనుకుని సమాధాన పడేవాడిని. ఇది పెద్దవారి కుతూహలానికి సమాధానం కావొచ్చు. మిగతా వారి మాటేమిటి ?

జీతం ఎంతో తేల్చకపోతే వారి బ్రతుకు తెరువు సాధ్యం కాదు. ఒక మృగం మరొక మృగాన్ని అడివిలో ఎదుర్కుంటుంది. తన కంటె బలమైనదైతే, అది శత్రువు; దాన్నుండి పారిపోతుంది. తనకంటె బలహీనమైనదైతే దాన్ని తినేస్తుంది, దానితో సమానమైనదైతే చెలిమి చేస్తుంది. మనుషులలోనూ అంతే. జంతువులలో బలాబలాలు నిర్ణయించేటందుకు తగినంత పరికరా లున్నాయి—కోరలు. కొమ్ములు. జూలు, పంజాలు ఎత్తు ఎగరడం, దూకడం. మనుషులలో ఈ వుపకరాలు లేవు—ఏ కొద్దిమందికో మోటారు కార్లుండొచ్చు. ఎత్తు మేడలుండొచ్చు:బ్యాంక్ పుస్తకం వుండొచ్చు. మిగత విషయాలలో ఇంచుమించు అందరూ వొకేలా గుంటారు. పైగా మేడలకి, కార్లకీ, జీతానికి సంబంధం వుంది. అందుకని, అదెంతో కనుక్కుంటారు.

అవతలవారి జీతం ఎంతో తెలిస్తే మనం క్షేమంగా వుంటాం. అట్లా తెలిసింతర్వాత, వారికో విలువ కట్టేసి, సంఘంలో వొక స్థానం ఇచ్చి మనం మరో చోట నిశ్చింతగా వుంటాం. ఈ దేశంలో ఎన్నో మతా లున్నాయి-యుగాని కొకటి చొప్పున. ఆధునిక యుగంలో మరో మతం లేవదీశారు వీరు—వీరిది జీతాల మతం—పై అధికారీ, కిం దధికారీ, మత ప్రచారకులు, ఇచ్చేవాడు దైవం. అదెంతో తెలుసుకునేవారుభక్తులు. జీతంలేనివారు అస్పృశ్యులు. ఈ తెగకి సహాయంచేసి. ఆ స్పృశ్యని తొలిగించాలని, ప్రభుత్వం కృషిచేస్తూ వుంటుంది. ఇట్లా కాక, మరెట్లా సమాధానం పడటం ?

* * *

మరో మూడేళ్లు గడిచాయి. నా ఉద్యోగం మారింది. పెద్దదైంది. జీతం మూడింతలైంది. ఈ మూడేళ్లలోనూ, జీతం ఎంత అని అడిగిన వారి సంఖ్య నూటఎనభై. వీరు కోరింది జీతం ఎంతతని కాదు. "యిప్పుడెం తిస్తారు" అని. ఉద్యోగం మారడం, జీతం పెద్దదవడం ముప్పే ననిపించింది.

నీ జీతం తక్కువగా వున్నప్పుడు, చెప్పడానికి చిన్నతనం పడ్డావు కాని, యిప్పుడు నిర్భయంగా, దర్జాగా, అడక్కపోయినా చెప్పకూడదా అంటారేమో మీరు! దీనికి రెండు సమాధానా లున్నాయి. గవర్నర్ జనరల్నైతే తప్ప, నామీద నాకంటె పెద్ద జీతం వాళ్లు ఎందరో వుండనే వుంటారు. నీజీతం ఎంత? అని ప్రశ్నించినవారికంటె నాది ఎక్కువ జీతమైతే, ఆ ప్రశ్నకి సమాధానం చెప్పడం సులభమే. అంచేత నన్ను యీ ప్రశ్న అడగదల్చుకున్న వారు ముందు వారి జీతం ఎంతో చెప్పేసి నా సమాధానంకోసం ఎదురు చూడాలి. వారిది నాదానికంటె ఎక్కువైతే, సమాధానం రాదు. ఈ ఏర్పాటు ఎంద రంగీకరిస్తా రంటారు? పైగా, "యిప్పు దేమిస్తారు?"అని అడగటంలో కొంత 'కసి' కూడా వుంది. అంటే, "ప్రస్తు

తం నీ జీతం గొప్పదైనా. మొదట్లో చిన్నదే లేవోయ్!" అన్న హేళనకూడా ఉందంటారా ?

బజార్లో బాల్యస్నేహితుడు బలరామయ్య కనపడి, నన్ను వాళ్లింటికి తీసుకెళ్లాడు, తన యిద్దరి సంతానాన్నీ చూపించాడు. బలరామయ్య డబ్బున్నవాడు. ఉద్యోగంచేసే అవసరం లేదు. ఉద్యోగాలు, జీతాలు,—వాటి తఫిసీళ్ళని తెలుసుకోవాలన్న మనస్తత్వం కనపర్చనందుకు సంతోషించాను.

ఇప్పుడెల్లా వుంది నీ కథ ?" అన్నాడు. మొదట్లో బెదిరిపోయాను.

"అంటే ?" అన్నాను.

"వొకటా, రెండా ?...."

నాకు భయమేసింది.

"లేక నాలా రెండా !" అని వాక్యం పూర్తి చేశాడు.


"పిల్లలా ?" అన్నాను.

"మరింకే మనుకున్నావు. ఉద్యోగంచేసి. రెండు మేడలు కడతావనుకుంటానా ?" అన్నాడు.

"కట్టినవాళ్లు లేరా ?" అన్నాను గర్వంగా.

"వెనకటి రోజుల్లో వున్నారేమో." విషయం తప్పించే టందుకు అతని పిల్లల ఆరోగ్యం కనుక్కున్నాను.

మీ అబ్బాయి పెద్దయింతర్వాత ఏం చేస్తాడు?" అని అడిగాను.



"అమ్మాయిని వెతుక్కుంటాడు" అని నవ్వుతున్నాడు. ఇంతలో అతన్ని స్నానానికి పిలిస్తే వెళ్ళాడు.

ఇద్దరు పిల్లలూ సిరాబుడ్డి తీసుకుని ఆడుకుంటున్నారు. పెద్దవాడు వాళ్లమ్మ పిలిస్తే లోపలి కెళ్ళాడు. రెండోవాడు సిరా తెచ్చి నా చొక్కాన రాశాడు.

పెద్దవాడు గ్లాసులో కాఫీతెచ్చి బల్లమీద పెట్టాడు. గుమ్మం వెనక నిలబడ్డ ఆమె. వాళ్ళమ్మ.

ఆవిణ్ణి నే నెరుగుదును. ఆవిడపేరు సూరమ్మ. వెనక నాకిచ్చి వివాహం చెయ్యాలనుకున్నారు. నాకు తగింత ఆస్థి లేదని విరమించారు. సూరమ్మకి తగినమొగుడు ఆ జిల్లాలో లేరనుకొన్నారు—ఏ వుత్తర హిందూస్థానం నుంచో రావాలిట; అంత చక్కందని ప్రతీతి.

"ఎక్కడుంటున్నారు?" అంది సూరమ్మ నీరశించిన కంఠంతో—ముగ్గురు సంతానం కలిగాక కంఠంలో మార్దవం ఎక్కడుంటుంది.

ఫలానా చోటని చెప్పాను. ఏం చేస్తున్నారంది; ఫలానా అన్నాను. "ఏమిస్తారు?" అంది.

నాకు మతి పోయింది. ఆ పల్చటి పెదవులు, చీకటి రహస్యాన్ని ఛేదించే ఆ నేత్రాల మెఱుపు, భౌతికప్రపంచానికి అతీతం కావల్సిన ఆ సూరమ్మ అనాది సౌందర్యం, అదా నాకివ్వవల్సిన సందేశం!

"రోజులు గడుస్తాయి" అన్నాను చమత్కారంగా. సూరమ్మ గాజులు జతలు మోచెయ్యిదాకా వున్నాయి; దుద్దులరాళ్ళు మెరుస్తున్నాయి.

"నెలకింతా అని లేదూ?" అని రెట్టించింది.

"మీ రెండోవాడు, భలే అల్లరిచేస్తాడు, కాదు?" అన్నాను. నేవేసే ప్రశ్నలో నాకే విశ్వాసం కుదరడంలేదు.

"పిల్లలా?" అంది.

"అమ్మయ్యా" అని, లోపల అనుకోవల్సింది, పైకి అనేశాను, ఆవేశంలో.

"అంటే?" అని, సూరమ్మ తెల్లబోయింది. ఆశ్చర్యంతో కనుబొమ్మలు మృదువుగా ముడుచుకున్నాయి.

"లేరు" అన్నాను.

"మీ ఆవిణ్ణి వోమారు తీసుకురా మా యింటికి. జీతం ఎంతో చెప్పకపోతే మానెలే" అంది.

"వాడి జీతం కథ కనుక్కుంటాగా" అన్నది లోపలనుంచి బలరామయ్య కంఠం.

ఏం, తను రాకూడదూ? భాగ్యవంతులైతే, వారింటికి నా భార్యని తీసుకెళ్లాలీ! తీసుకెళ్ళి ఉద్యోగం వయనంఅంతా బైటపెట్టి వినోదించి, మళ్ళా తిరిగి నాకు వొప్పచెపుతారా! సరే అన్నాను ఆ సమయంలో—లోపల పంపకూడదని నిశ్చయించుకున్నాను. సౌందర్యం, భాగ్యం—రెండూ సూరమ్మ విషయంలో గర్వకారణాలే. కాకపోవొచ్చు. నాకల్లా కనిపించింది ఏం చెయ్యను? నా మనస్సు తప్పితే, నాకింకే యదార్థం వుంటుంది!

ఇంతట్లో బలరామయ్యొచ్చాడు.

"అబ్బో నువ్వెక్కడ! పెద్ద వుద్యోగస్తుడవయ్యావు. నువ్వు మీ ఆవిణ్ణి తీసుకొస్తావా?" అన్నాడు వెటకారంగా. వెటకారంగా అన్నా, అతనన్నది నిజమేనని లోపల స్ఫురించింది. ఆలోచించండి పెద్దజీతంవాడు, చిన్నజీతం వాడింటికి సామాన్యంగా వెడతాడూ? వెడితే వాళ్ళ గృహం పావనం చేసినట్లు భావిస్తాడు. చిన్నజీతంవాడు, పెద్దజీతం వాడింటికి వెడితే

చిన్నతనం అనుకుని వెళ్ళదు. మొత్తంమీద వొకడింటికి వుంకోడు వెళ్ళడు. బాల్యంలో ఎంత స్నేహితులైనా, యిద్దరిమధ్యా వొక గోడలేస్తుంది. మొదట్లో కేవలం యిటికల గోడ—మధ్యమధ్య శుభకార్యాలూ, పండుగలూ, అనే కంత యింటాయి. ఈ కంతలు గూడా కొంతకాలమే. వారివారి భార్యలు రాగానే, కంతలుపూడ్చి, సిమెంటు చెయ్యడం జరుగుతుంది.

"ఏం, మాట్లాడవేం?" అని బుజంమీద చరిచాడు. కంగారుపడి లేచాను. అవుననీ, కాదుకాదనీ, నవ్వేశాను. ఆడదానికి కన్నీరూ, మొగాడికి నవ్వూ, అవాంతరాలలో అభయం.

నువ్వూ, సూరమ్మా మా యింటికి రాకూడదూ?" అన్నాను. బలరామయ్య ఆశ్చర్యపడ్డాడు.

"మా ఆవిడ పేరు నీకెట్లా తెలిసింది?" అని అడిగాడు.

"శుభలేఖలో వుండదూ!" అన్నాను.

"ఓర్—నీకింకా జ్ఞాపకంవుందా."

"మందమరపు భాగ్యవంతుడి శీలంలో మణిలాంటిది" అన్నాను హాస్యధోరణిలో.

"బీదార్పులారుస్తున్నావు.—నీజీతం ఎంతేమిటి?" అని అడిగేశాడు. నా తెలివితక్కువని నిందించుకుని నాలిక కొరుక్కున్నా.

"చెప్పవేం?"

"నాలో సంస్కారాన్ని బట్టి, నా జీతం నువ్వే నిర్ణయించొచ్చు" అన్నాను నిగూఢంగా.

"జీతాన్ని బట్టి సంస్కారాన్ని నిర్ణయిస్తే, జమీందారులు గొప్ప సంస్కారం గలవాళ్ళవాలి" అన్నాడు బలరామయ్య.

"నువ్వు చెప్పింది తొంభైపాళ్ళు నిజం. కాని చిన్న భేదం వుంది. జమీందార్ల ఆదాయాన్ని జీతం అనరు. అది ఆర్జించని రాబడి. అదే మన నాగరికతకి, కళకి, విజ్ఞానానికీ, సంస్కారానికీ, పునాది—వెన్నెముక" అన్నాను. తెచ్చిపెట్టుకున్న ఆవేశంతో.

"స్వార్జితం కాని రాబడి గలవాళ్ళకి తప్ప మిగతవాళ్ళకి సంస్కృతి లేదంటావు?"

"లేదన్ను. వారి సంస్కృతియొక్క పరిమాణం, జీతాన్నిబట్టి నిర్ణీతమౌతుంది."

"ఒప్పుగుంటాను మహానుభావా. అవుతే, నీ సంస్కృతినిబట్టి, నీజీతం వెయ్యి రూపాయలని నాకు స్ఫురించింది.' అన్నాడు బలరామయ్య హేళనగా.

"జీతాన్నిబట్టి నిర్ణీత మయ్యేది వొక సంస్కృతే కాదు. అజ్ఞానంకూడా. జీతం పెద్దదైన కొద్దీ అజ్ఞానంకూడా ఎదుగుతూ వుంటుంది'' అన్నాను. బలరామయ్యకి అది నచ్చలేదు. ఓవిధంగా నాకూ-డా నచ్చలేదు.

"పోనీ సరే నంటాను. అజ్ఞానాన్నిబట్టి చూసినా, నీజీతం పన్నెండు వొందలకి తక్కువ కాకూడదు" అన్నాడు బలరామయ్య, నవ్వుతూ.

"బాగుంది. అజ్ఞానంలోంచి, సంస్కృతి తీసెయ్యి" అన్నాను.

"ఉండు, వుండు....తీసివేతలూ, భాగాలూ మనకి బాగారావు—ఆ.... రెండువొందలన్నమాట" అన్నాడు.

"సరిగ్గా అంతే కాదనుకో....ఆ చుట్టుపక్కల...."

"హస్త సాముద్రికంలాంటి కొత్త పక్కీ కనుక్కున్నావే! సరిగ్గా ఎంత జీతమో ఎట్లా తెలుసుకోవాలో, ఏదైనా మార్గంపట్టుకుని, వో పుస్తకం వ్రాసి పారెయ్యకూడదూ" అన్నాడు నవ్వుతూ.

కి న్నె ర

"సరియైన అంకె రావాలంటే వోమార్గం వుంది. దానికి తికమకలున్నాయి. జీతగాడి భార్యయొక్క అజ్ఞానం, సంస్కృతీకూడా నిర్ణయించి, భర్తకీ, భార్యకీవున్న వ్యత్యాసం ఎంతో, అది సరియైన సంఖ్య."

"గొప్పగావుంది. దీన్నిబట్టి నా జీతం ఎంతో చెప్పు" అన్నాడు.

"నీది జీతంకాదు. ఆర్జించని ఆస్తి" అన్నాను.

"చంపేశావు. పోనీ స్త్రీలకి జీతం లేదు కదా, వారి సంస్కృతిని నిర్ణయించడం ఎట్లా?" అని అడిగాడు,

"వారి సంస్కృతి చక్కదనాన్నిబట్టి నిర్ణీత మౌతుంది. మొగాడికి జీతం అవకాశాలు కల్పించినట్లుగానే, ఆడదానికి చక్కదనం అవకాశాలు కల్పిస్తుంది."

"ఈ సిద్ధాంతంప్రకారం, చక్కదనం కొద్దీ ఎక్కువయ్యేది అజ్ఞానమా, సంస్కృతా?"

"అవకాశాలు" అన్నాను.

"అంటే?"

"భాగ్యం యిష్టం వొచ్చినట్లుగా జీవించే అవకాశాలు కల్పిస్తుంది. విశ్రాంతి, అదనంగా డబ్బు.—రెండూ వుంటేనే సంస్కృతి వుంటుంది. స్త్రీకి, యీ రెండూ చక్కదనంతో వొస్తాయి. అంటే, యీ రెండూ వున్నవాడు ఆమెకు లభిస్తాడు."

"ఆగు, ఆగు. లభించింతర్వాత, మొగుడికి ఆ రెండూ పోతే?"

"ఆ విషాదగాథలు సాంఘికజీవితంలో కల్లోలాలకీ, సారస్వత అభివృద్ధికీ కారణాలు."

"మరోటి. కర్మవశాత్తు వొక అందమైన ఆడదానికి యీ రెండూ లేనివాడు లభిస్తాడనుకో. అప్పుడు?" అని అడిగాడు.

"అవకాశాలుండనే వుంటాయి. తన చక్కదనంవల్ల, మొగుడికి ఆ రెండూ లభ్యమవచ్చు కూడా" అన్నాను. బలరామయ్య ఎందుకో ఆలోచనలోపడ్డాడు. మనిషిమొహంలో 'కళ' తగ్గింది. నా వ్యాఖ్యానం సూరమ్మకు అన్వయించి బాధపడుతున్నాడా! ఏమో! సెలవుతీసుకుని నే వెళ్ళిపొయ్యాను. ఆ మర్నాడు ఆదివారం సాయంత్రం అతను మాయింటికొచ్చి, సుందరాన్ని చూసి, కొంత తేరుకుని వెళ్ళిపొయ్యాడు. నాకదొక అపూర్వమైన అనుభవం.

ఆవేశంలో, అనేక సిద్ధాంతాలు చేసేశాను. నాగరికతపై విప్లవం చేసే శక్తి అందరికీ వుండదు. వంటింట్లో విప్లవం చాలా సులభం. మూడు సంవత్సరాలైంతర్వాత, బలరామయ్య, సూరమ్మని విడిచిపెట్టేశాడని విన్నాను. ఎందుకో, వివరంగా తెలిసిందికాదు. నా జీతం ఎంతో అడక్కపోతే, సూరమ్మ జీవితం అట్లాగై వుండదేమోననిపించింది. 'జీతం', 'జీవితం'—అక్షరాలు, అర్థం, ఎంత దగ్గర!! సృష్టిరహస్యం అర్థంకాకుండా, వొక్క అక్షరం అదనంగావుంది!

* * *

మరో మూడు సంవత్సరాలకి నా జీతం మూడింతలైంది నా సమకాలికు లందరికీ జీతం ఎంతో తెలిసిపోయింది. మరో తరం బైలుదేరింది. వారందరికీ మేం పెద్దలం! ఆదర్శ వ్యక్తులం; మార్గదర్శకులం. మా జీతాలతో వారికంత నిమిత్తంలేదు; మా కంత గౌరవం వుంది సంఘంలో.

అలవాటుచొప్పున నా సమకాలీకులలో కొందరు యింకా నిలేసి నా జీతం ఎంతో అడిగిన వాళ్ళు లేకపోలేదు. ఏం చేస్తారు? అడిగేటందుకు వారికి మరో ప్రశ్న కనబడలేదు పాపం! ఇచ్చేటందుకు మరో సందేశంలేదు.

భార్య ఆరోగ్యం ?

పిల్లలు కులాసా ?

ఇంక్రిమెంటొచ్చిందా ?

ట్రాన్స్‌ఫరైందిటగా !

రిటైరైతే పెన్షనెంత ?

ఇది-వారు పాడుకునే భావగీతం.

నాకాడపిల్లలు లేరు. అంచేత అల్లుడులేడు. ఉంటే వారుచేసే గానం వేరు.

అల్లుడికేమిస్తారు.

అబ్బాయి కేమిస్తారు.

పెద్దకుటుంబాలైతే ఖండకావ్యం ధోరణి వేరు.

మొదటివాడికి రెండొందలా ?

రెండోవాడికి వందా ?

మూడోవాడికి, చిత్రం,మూడొందలుటగా?

చిన్న చదువుకి పెద్ద జీతం.

అజ్ఞానానికి సున్నా.

అయ్యోపాపం ! జ్ఞానానికి, అరసున్నా !

ఆ రోజుల్లో నా జీతం అడిగేవారు, యించు మించు నా గడింపే కలవారు. వీరు ప్రశ్నించే ఫక్కీ-వేరు—అదొక కళ. వీరు హైరోడ్డు మీద నడవక సందులమ్మట పడతారు.

రామనాథం, నేనూ రైల్లో ప్రయాణం చేస్తున్నాం. మేం యిద్దరం ఎరుగున్న కుటుంబ రావునుగురించి మాట్లాడుకుంటున్నాం.

"పాపం కుటుంబం —" అన్నాడు.

"అవునవును" అన్నాను వినిపించుకోకుండా.

"ఆ జీతంతో నా సిగరెట్లు గడవ్వు" అన్నాడు. నిజానికి నాకు, రామనాథాని కెంతిస్తారో తెలీదు. పెద్ద జీతమైవుండాలి.

"నువ్వేమాత్రం ఇన్సూర్ చేశావు ?" అని అడిగాడు.

"ఏమీ చెయ్యలేదు."

రామనాథం ఆశ్చర్యపడ్డాడు.

"పోనీ బాంకులో ఏమాత్రం ?"

"సున్నా"

కొయ్యిబారాడు.

"ఏంకథ. గుర్రం పందాలా,....లేక...."

"........?"

ఏమోలే....అల్లా అనుకోవలసివొస్తోంది."

"........"

"మరి జీతం అంతా ఏమౌతోంది ?"

"ఎంత చెట్టుకి అంత గాలి" అన్నాను.

"నీ చెట్టుసైజేం మాత్రం?"

అదీ నాగరీకుల మార్గం. మొహాన పేడ నీళ్ళు జల్లరు—అందులో కాస్త పన్నీరు కలిపి మరీ జల్లుతారు.

"మాట్లాడవేం ?"

"చెట్టు ఎంత పెద్దదైతే అన్ని కొమ్మలు" అన్నాను.

"పిల్లల కవుతోందన్నమాట !"

"నీకెందరు ?" అని అడిగాను.

వివరాలు చెప్పాడు. పెద్దవాడు రంగూన్‌లో వున్నాడు, వాడిజీతం మూడొందలు. అదృష్టవశాత్తు రైలు నిలిచింది. నేను దిగి ప్లాట్‌ఫారం మీదికి నడిచాను. రాజారావుగారబ్బాయి, రంగారావు కనిపించాడు. నాచేతిలో బాగ్ తీసుకున్నాడు.

"ఏమండోయ్ —విన్నారా—నాకుద్యోగం దొరికింది." అన్నాడు వుత్సాహంతో.

"సంతోషం"

"ఆరంభంలో నూరు. మీకెంతండీ ?"

అని అడిగాడు. బాగ్ లాక్కుని గబగబ నడిచిపోయ్యాను.

మరోతరంవారు, వేరన్నాను యిందాకా. ఇందులో, నే పొరబడ్డాను. వారి సందేశం యిదే-అని కించపడ్డాను. ఎందులో సమానత్వంలేని యీదేశానికి యిందులో ఐక్యత కుదిరింది. సమానత్వం అనేది మానవుడి స్వప్నంగా వుండాల్సిందేకాని యథార్థం కాదేమో!

నాకావూరు కొత్త. జబ్బుచేసింది. మంచానపడ్డాను. సుందరంకూడా నలతగానేవుంది. ఓ మిత్రుడు వొక డాక్టర్ని తీసుకొచ్చాడు. ఆయన అన్నీ పరీక్షచేసి మందు వంపించాడు. రెండు రోజులైంది. నయం కాలేదు.

"మలేరియా — రెండురోజుల్లో తగ్గుతుంది'' అని హామీ యిచ్చాడు.

"ఇది సీజన్. చైర్మెన్ కీ యిదే జబ్బు. నా ట్రీట్మెంటే. మొన్న సబ్ కలెక్టర్ మామగారు వైరిస్తే వెళ్ళాను. మలేరియా" అవన్నీ వర్ణించ్చాడు డాక్టర్.

"మీరు యీవూరికి కొత్త. ఏంచేస్తున్నారు"

ఫలానా అన్నా.

"ఏమిస్తారు?''

సబ్ కలెక్టర్కీ, చైర్మన్కి ఏమిస్తారో ఆయనకి తెలుసు. మరి నా విషయమో! తెలిస్తే గాని, తను అల్లుకున్న వలలో నన్ను యిమడ్చలేడు. చేపలవలలో బురద పాము పడితే ఎట్లా? నాకు నీరసం, దిగులు, మాట్లాడే వోపిక లేదు. నన్ను రెస్టుతీసుకోమని ఆయనే అన్నాడు. నాచేత ఎందుకు మాట్లాడిస్తాడు? ఆప్రశ్నకి సమాధానంయిచ్చి నేను కళ్లుమూస్తే బిల్లు పంకపోయినా ఆయనకి చింతలేదు.

నేను కళ్లు మూసుగున్నాను. నాకు కోపం రాలేదు. జాలేసి ఏడుపొస్తోంది. సమాధానం యివ్వనంతవరకూ. ఆయన పాదాలకింద ధ్వనించే భూకంపాన్ని నేను సమాధానం యిచ్చి మరీ చావమంటుంది సంఘం.

"బిల్లు పంపించండి'' అంది సుందరం.

ఆయన పంపలేదు. మళ్ళా రాలేదు.

మరో మూడేళ్ళు గడిచాయి. ఏళ్ళు గడవడం కథల్లోనే కాకుండా జీవితంలోంచి కూడా సులభం. గడిచిపోటం గురించి ఆలోచిస్తేనే జీవితం అంతా వొక దుస్వప్నంలాగుండటం. సృష్టి అంతా మాయగా తోచడం జరుగుతుందేమో. ఎంత దూరం, ఎంతకాలం ప్రయాణంచేసినా, అక్కడే వున్నాను—అద్దంలో చూసుగుంటే ప్రయాణం బడలిక కొంచం కనబడొచ్చు. సంఘానికి నా జీతంగురించి పరామర్శలు తగ్గాయి. కొత్తవ్యక్తులను కవ్వించడానికి పోయింది. సంతాన నిరోధకమార్గం మన దేశంలో ప్రచారం కాకపోవడంవల్ల నాకు జరిగిన వుపకారాలలో యిదొకటి. కొత్తగా జన్మించిన వారి జీతాల పస కనుక్కుంటుంది మరి!

నా జీతం పెద్దదైంది. ఇంకంతకంటె పెద్దదయ్యే అవకాశాలు లేవు. దేశానికి స్వాతంత్ర్యం కూడా వొచ్చింది. అంచేత నాకు మరో అంతకంటే పెద్ద వుద్యోగం, 'కేంద్రంలో' దొరకడం అసంభవంకాదు. నాఅభిప్రాయాలు చాలావరకూ స్థిరపడిపొయ్యాయి. మంత్రులందరూ జీతాలకట్టలలో కనబడతారు. సంఘం అంటే ఎంత? అని అడిగే వొకధ్వని. 'శ్రీ'అంటే జీతాన్ని మాయంచేసే వొకశక్తి: 'శ్రీ' జీతాన్ని తగ్గించగల్దు; హెచ్చించగల్దు;

కిన్నెర

అసలులేకుండా మాయం చెయ్యగల్దు. సత్యం అంటే జీతం ఎంతో కనుక్కోవడం. సౌంద ర్యం జీతం ఎంతో అందంగా అ డ గ డ ం. సంస్కారం అంటే అదే చమత్కారంగా అడ గడం; 'కళ' అంటె అదెంతో చెప్పకపోవడం — యీవిధంగా నామన స్తత్వం తయారైంది. నేనేం చెయ్యను ?

నేనే వుంకొకరికి జీతాలిచ్చే ఏర్పాటుంటే — అప్పుడు నన్ను "మీరే మిస్తున్నారు?" అని అడిగే మహానుభావు లుంటారు. ఆ ఏర్పాటు లేదు; అంచేత వొక్కటేమార్గం వుంది; సన్యాసం పుచ్చుకోవాలి — సన్యాసి యివ్వడు, పుచ్చుకోడు — పుచ్చుగుంటే ఎప్పుడేనా, పాలు, పళ్ళు, యిస్తే, ఎప్పుడేనా కా స్తంత బూడి దిస్తాడు.

సుందరం మనస్సుకూడా స్తిమితంగాలేదు. ఏదో మూగబాధ; నాకేసి చూశ్శేదు; నాతో మాట్లాడలేదు: వెఱ్ఱిగా చూస్తుంది; స్వప్నంలో సంచారం; మేం వొకరికొకరు దూరమై పోతున్నాం. పిల్లలు చెయ్యి చెయ్యి కలుపు తున్నారు. వేళ్ళు నెప్పెట్టి వొదిలేస్తాం. శరీరాలు విడిపోయి, ఆత్మలు రెండూ ఏకమౌ తున్నా యనుకోవాలి, ఏమిటో అ ద ం తా భ్రమేమో! శరీరాలు భ్రమైతే, ఆత్మలు కాకూ డదా ఏమిటి ?

విశాలానంద స్వామిని వొకసారి దర్శనం చేశాం. ఆయన గొప్పయోగి; ఆ య న్ని గురించి వింతగా చెప్పుగున్నారు. ఆయన మహానుభావుడు, ఆయన్ని చూస్తే సందేహా లన్నీ పోతాయన్నారు. వొక ప్రశాంతత హృ ద యా న్ని ఆవరించుకుంటుందన్నారు. కి న్నె ర

వొందలకొలది జనం వెళ్ళి ఆయన్ని చూసి వొస్తున్నారు. మాక్కూడా ప్రశాంతత కావాలి.

ఉదయం ఎనిమిదైంది. ఆశ్రమంలో వో పదిమందికంటె ఎక్కువ జనంలేరు. వెళ్ళి గచ్చుమీద నమస్కారంచేసి కూర్చున్నాం నేనూ, సుందరమూ.

విశాలానంద స్వామి నిండైన విగ్రహం, విశాలమైన నుదురు, పెద్దకళ్లు, వెడల్పాటి నోరు, లావాటి మెడ — నాటకంలో విగ్గులేని భీముడి వేషంలా వుంటుంది. నిమీలతనేత్రుడై ధ్యానంచేసి, కొంతసేపటికి తేరుకున్నాడు. చిత్రంగా నవ్వి, దగ్గరగా జరిగిన నలుగుర్నీ కుశలప్రశ్నలు వేస్తున్నాడు. చ ను వు గా మాట్లాడాడు; నాకు భయంపోయింది. కొందరు యోగులు మాట్లాడరని వినికిడి. ఈన, అట్లా కాదు. నాకు సంతోషం కలిగింది. నాసందేహా లన్నీ తీర్చుకోవచ్చునని, పరమానంద భరితు ణ్ణయ్యాను.

నేను ఎక్కడనుంచి వొచ్చిందీ అ డి గా రాయన.

నమ్రతతో చెప్పాను.

ఏం చేస్తున్నదీ అడిగారు.

ఇంకా నమ్రతతో ఫలానా అని చెప్పాను.

"ఏమిస్తారు?" అన్నా రాయన.

నేను స్తంభించిపోయాను. చావడం సుఖ మై వుంటే, చనిపోదునుకూడా! స మా ధి లో పడ్డాను. ఒకగొప్ప తేజస్సు నాలో లేచింది. ఎవరో హృదయాన్ని బైటికితీసి, కడిగి మళ్ళా స్వస్థానంలో వు ంచి న ట్ల యి ం ది. చర్మం వెనక్కి తిరిగినట్లుంది ఆ అనుభవం. జ్ఞానోదయమైంది; సత్యాన్ని తెలుసుకున్నాను

ఆత్మశుద్ధి జరిగింది. ఆత్మ పవిత్రమైంది, సందేహాలు, సంశయాలు నశింపయ్యాయి. ఆత్మబోధచే, సత్ చిత్ ఆనందాలు జీవాత్మగా మారి పరమాత్మలో ఐక్యమయ్యాయి. అదీ యీదేశం నాకిచ్చిన సందేశం.

దాని ఫలితం ?

నేను వుద్యోగాన్నుంచి విరమించాను.

గోదావరి నదీతీరాన్ని చిన్న పాకేసుకున్నాను.

ఒక ఆవుని తెచ్చుకున్నాం.

సుందరం నదిలో స్నానంచేసి, పాలు పితుకుతుంది.

ఇద్దరం త్రాగి, విశ్వాన్ని తిలకిస్తాం.

ఎవరేనావొస్తే, కాసిని పాలిస్తాం.

గడ్డిపోచల్ని కోస్తుంది సుందరం—నేను పొక్కుటొక్కుచే నదిలో వొదిలి అలలమీద నాటిప్రయాణం పరిశీలిస్తాను.

సంధ్యవెలుగులో ఎఱ్ఱనై గడ్డిపూచ నీటిని వచ్చుగా కలవరపెట్టి, విభ్రాంతగా కదిలి, నా మనస్సులో నిలిచిపోతుంది.

అదీ, అది నాకిచ్చిన సందేశం.




బెర్ట్రెండ్ రసెల్

(బెర్ట్రెండ్ రసెల్‌ను గూర్చి శ్రీ గోపీచంద్‌గారి వ్యాసం డిసెంబరు (1949) కిన్నెరలో ప్రకటింపబడినది)